పశు పోషణతో రైతులకు ఆర్థిక బలం : జెసి

కడప అర్బన్ : గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ప్రధాన ఉద్దేశమని జెసి గణేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సభా భవన్‌లో పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ శారదమ్మ అధ్యక్షతన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) పథకం ఆవశ్యకతపై పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దార్లు, పెంపుడు జంతువులను పెంచేవారికి జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెసి ప్రభుత్వ ఉద్యాన శాఖ సలహాదారులు పి.శివప్రసాద్‌రెడ్డి, జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు నాగ మల్లేశ్వరయ్య, ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల డీన్ వై. వైకుంఠ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సునీత, ఎపిజిబి ఆర్‌ఎం పురుషోత్తం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రపంచం అంతా పాడి, పశు సంపద పైనే ఆధారపడి జీవిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన శాఖ సలహాదారు పి. శివ ప్రసాద్ రెడ్డి, డిడ్డి, ఎడి, పశు వైద్యులు, గొర్రెల పెంపకం దార్లు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ రీజియన్ కార్యాలయంలో ఇష్టారాజ్యం నడుస్తోంది. జిల్లాలోని ఆర్‌డి కార్యాలయంలోని సీనియర్ ఉద్యోగుల త్రయం రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవ లేదన్న సామెత చందంగా వ్యవహారం సాగిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో గతేడాది నుంచి ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్లపై నిషేధం అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. జోన్-4 పరిధిలోని ఆర్‌డి కార్యాలయ ఉద్యోగులు అవకాశాన్ని భారీగా సొమ్ము చేసుకోవడంపై ఉన్న ధ్యాస మినహా ఇవేమీ పట్టడం లేదనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. గతానికి భిన్నంగా ఇటీవల అధికార పార్టీల నేతల సేవల్లో సేద తీరుతుండడం వ్యవహారం పరాకాష్టకు చేరుకుంది. ఫలితంగా అర్హత కలిగిన వేలాది మంది ఉద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. రిక్రూట్‌మెంట్ గడువు ముగియడం దగ్గర నుంచి బదిలీలు, డిప్యూటేషన్ల నిషేధం అమలు వరకు యథేచ్ఛగా ఉల్లంఘనలకు గురవుతున్నాయి.

ఆర్‌డి ఆఫీసులో ఎంపిహెచ్‌ఎస్‌ల బదిలీల జోరు

అధికార పార్టీ నేతల సిఫారసులకు జీహుజూర్ - నిషేధ ఉత్తర్వుల అమలు బేఖాతర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజియన్ కార్యాలయం నిబంధనల ఉల్లంఘనకు నిలయంగా మారింది. ఈ ఏడాది జనవరిలో ఎంపిహెచ్‌ఎస్ ఉద్యోగుల బదిలీలు, రిక్రూట్‌మెంట్ వ్యవహారం నడిచిన సంగతి తెలిసిందే. సీనియర్ ఎంపిహెచ్‌ఎస్ ఉద్యోగులకు ఆప్షన్ ఇచ్చిన అనంతరం రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. అనంతరం మిగిలిన ఖాళీలకు రిక్రూట్‌మెంట్ నిర్వహించడం గమనార్హం. ఇంతవరకు భాగానే ఉంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో ఏడాదికిపైగా బదిలీలు, డిప్యూటేషన్ల రద్దు అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. కానీ ఆర్‌డి కార్యాలయ ఉద్యోగులకు ఇవేమీ పట్టడం లేదని, వచ్చిన అవకాశాన్ని సొమ్ము చేసుకోవడం మినహా మరేమీ పట్టించు కోవడం లేదనే విమర్శ ఉద్యోగ సంఘాల నుంచి వినిపిస్తోంది. రిక్రూట్‌మెంట్ అనంతరం రోజుల తరబడి అపాయింట్‌మెంట్ లెటర్లు పంపించకపోవడం దగ్గర నుంచి సందులో సడేమియాగా తమను కలిసిన, అనుకూలమైన ఉద్యోగులకు కోరిన స్థానాలకు మార్చడం వంటి ఉల్లంఘనలకు యథేచ్ఛగా పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా జిల్లాలోని అధికార పార్టీకి చెందిన నేతల సిఫారసులకు అనుగుణంగా బదిలీల నిషేధం రద్దును పక్కనబెట్టి బదిలీలకు తెర లేపడం చర్చనీయాంశంగా మారింది. 15 రోజుల వ్యవధిలో బదిలీల నిషేధం ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ నేతల సిఫారసుల అనుసారం 3 నుంచి 12 మంది ఎంపిహెచ్‌ఎస్ ఉద్యోగులను కోరిన స్థానాలకు బదిలీ చేసినట్లు సమాచారం. ప్రభుత్వ బదిలీ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ సదరు ఉద్యోగత్రయానికి పట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జోన్-4 పరిధిలో కొంతకాలంగా నడుస్తున్న విపరీత ధోరణుల్ని నిలవరించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

రాజకీయ ఒత్తిడులు వాస్తవమే

ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల బదిలీలు చేయాలని రాజకీయ ఒత్తిడులు వచ్చిన మాట నిజమే. ఉద్యోగుల బదిలీ ఫైలుపై సంతకం చేయాలి కదా, ఎటు వంటి బదిలీలు చేయలేదు. అయినప్పటికీ మరోసారి పరిశీలన చేస్తా.

- డాక్టర్ అనిల్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్, కడప.

సంస్కరణలో భాగంగానే జిపిఎస్ అమలు

-ఆ మూడు పార్టీలు బిజెపిని మోస్తున్నాయి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఐఎంఎఫ్ నిర్దేశిత పెన్షన్ సంస్కరణలో భాగంగానే జిపిఎస్ అని, అంగన్వాడీలకు బిఆర్‌ఎస్ ఇస్తున్న వేతనం రాష్ట్రంలోని అంగన్వాడీలకు ఇవ్వాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన జిల్లాలోని వామపక్ష పార్టీల ఉమ్మడి సమావేశం మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, సిపిఐ (ఎం.ఎల్.) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, సిపిఐ. (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య, ఆర్‌ఎస్‌పి జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి జయవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు జిపిఎస్. రద్దు, ఓపిఎస్. సాధన కోసం చేపట్టిన శాంతియుత 'ఛలో కలెక్టరేట్ల' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం భగ్నం చేయటానికి పోలీసులను ఉపయోగించిందని విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులను గృహనిర్బంధం చేయటం, ఉపాధ్యాయ కార్యాలయాలకు ముందు పోలీసులను మోహరించటం, పౌర హక్కులను కాలరాసి, రాజ్యాంగ ఉల్లంఘన చేయడమేనని ఆరోపించారు. సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐక్య కార్యాచరణ కూటమి పిలుపు మేరకు వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కన్నా వెయ్యి రూపాయల అదనంగా ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీలకు జీతభత్యాలు పెంచుతామని హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. "చలో విజయవాడ" పిలుపును భగ్నం చేయడానికి పెద్ద ఎత్తున పోలీసులను అంగన్వాడీలపై ఉసికొల్పి అక్రమ అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, అక్రమ కేసులు ప్రయోగించటం చట్ట విరుద్ధమని తెలిపారు. అప్రజాస్వామిక చర్య అన్నారు. అంగన్వాడీలపై పురుష పోలీసులను ప్రయోగించటం 'పోలీస్ కాండక్ట్ రూల్స్ ప్రొసీడింగ్స్'కు విరుద్ధమని వీటిపై న్యాయస్థానాలు 'సుయో మోటో'గా కేసులు నమోదు చేసి పోలీసులను విచారించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలోని బిజెపి అప్రజాస్వామిక విధానాలను మోస్తున్నాయని చెప్పారు. స్వతంత్ర కార్యాచరణ లేదని వారు ఎద్దేవా చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు, నిత్యావసర వస్తువులు అధిక పెంపు, ప్రజలు మోయలేని పన్నుల భారాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక పరిపాలనను నిరసిస్తూ, అధికార పార్టీ ధనార్జన ముఠాలు రియల్ ఎస్టేట్ రియల్‌టర్లు కలెక్టర్ సంతకాలనే ఫోర్జరీ చేస్తూ, ప్రభుత్వ భూములను బాహాటంగా కబ్జాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 27న 'వామపక్ష పార్టీల ఉమ్మడి ఛలో కలెక్టరేట్ ధర్నాల' ను జయప్రదం చేయాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఓబులేసు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బాదుల్లా, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి. ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ మహాసభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్వర్ణోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా అక్టోబర్ ఒకటో 1న విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆవిర్భావం నుంచి అనేక విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యుటిఎఫ్ పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్య మేరీ, నాయకులు గోపీనాథ్, ప్రకాష్, కిరణ్ కుమార్, దేవదత్తం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాగ్ రిపోర్టు వైసిపికి చెంపపెట్టు : పిసిసి

కడప : కాగ్ రిపోర్టు వైసిపికి చెంపపెట్టు అని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు. అంగన్వాడీలపై ప్రభుత్వ ధమనకాండ గర్హనీయమని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇంద్ర భవన్‌లో జిల్లాకు చెందిన అసెంబ్లీల సమన్వయ కమిటీల కన్వీనం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థ పై రాజధాని అమరావతిపై కాగ్ ఇచ్చిన రిపోర్టు జగన్ ప్రభుత్వానికి చంపపెట్టు అన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల స్ఫూర్తికి విరుద్ధమని, ఏపీ పంచాయతీ రాజ్ పురపాలక నిబంధనలకు విరుద్ధమని కాగ్ స్పష్టంగా చెప్పింది అన్నారు. ఇప్పటికైనా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలను స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

చింతకొమ్మదిన్నె : రైతులకు మెరుగైన సేవలు అందించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు, మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. విలువ ఆధారిత ఉత్పత్తుల కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతిలో ఔత్సాహికుల కోసం వ్యవసాయ అంకుర కేంద్రం ఉందని, నూతన ఆవిష్కరణల కోసం సాంకేతిక, ఆర్థిక సహ కారం అందిస్తుందని పేర్కొన్నారు. అమూల్ ఫుడ్స్ అధినేత ప్రేమా నంద మాట్లాడుతూ ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు, ఆయన వెంట కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు మహేష్ బాబు, లావణ్య, శిల్పకళా, మానస, సాయి మహేశ్వరి, స్వామి చైతన్య, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామలక్ష్మి పాల్గొన్నారు.

29 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ విజయం

కడప : ఎసిఎ అండర్-23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం ఎసిఎ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్ లో కృష్ణ జట్టుపై 29 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 49.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. అనంతరం 246 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కృష్ణ జట్టు 49.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసి ఓటమి పాలైంది. **29 పరుగుల తేడాతో విజయం సాధించిన నెల్లూరు జట్టు** కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో విజయనగరం జట్టుపై 29 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 40.4 ఓవర్లలో 204 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని నిఖిలేశ్వర్ రెడ్డి 37 పరుగులు చేశాడు. విజయనగరం జట్టులోని జె. దుర్గాకుమార్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 205 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన విజయనగరం జట్టు 39.2 ఓవర్లలో 175 పరుగులకు ఆల్ అవుట్ అయ్యి ఓటమి చెందింది. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్ లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై 45 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది.

'కొండూరు'కు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజుకు ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా నిర్వహించిన టూరిజం ఫొటోగ్రఫీలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పురస్కార్ అవార్డు -2023 దక్కింది. ఈ మేరకు నిర్వాహకులు టి. శ్రీనివాసరెడ్డి జనార్ధన రాజుకు సమాచారం తెలిపారు. ఈనెల 27 ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా ఈ బహుమతిని విజ యవాడలో నిర్వ హించే ఓ సభలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తాను జిల్లా లోని ఒంటిమిట్ట దేవాలయం ఫొటోను పంపామని, దానికి బహుమతి రావడం సంతో షదాయకమన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌జెడి తనిఖీ

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఆర్‌జెడిపి. బాబు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని అధ్యాపక సిబ్బందికి సూచించారు. రికార్డులు తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని, నాక్ గుర్తింపు కోసం రికార్డుల నిర్వహణ కో సం సూచనలు ఇచ్చారు. కళాశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. ఎన్‌సిసి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ అధ్యాపక సిబ్బంది ఆర్‌జెడిని మర్యాదపూర్వకంగా శాలువా పూలమాలతో సత్కరించారు.

జిల్లా స్థాయి పోటీలకు 'సెయింట్ ఆంటోనీస్' ఎంపిక

కలసపాడు : అండర్-17 క్రీడా పోటీల్లో జిల్లా స్థాయికి సెయింట్ ఆంటోనీస్ విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం చిత్తా ప్రభావతి, పిఇటి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఇండియా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. వాలీబాల్, కబడ్డీలలో తమదైన శైలిలో క్రీడా స్ఫూర్తితో ఆడాదరన్నారు. కబడ్డీ విభాగంలో సి. హర్షవర్ధన్‌రెడ్డి, రంగ రోహిత్, చరణ్, భరత్ వాలీబాల్‌లో ప్రభాస్, నందకిశోర్, జైరామ్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వారిని అభినందించింది.

పరిశుభ్రత, పారిశుధ్యం అవసరం

కడప : ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించడానికి సరైన పరిశుభ్రత, పారిశుధ్యం అవసరం అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌సిసి కేడెట్లచే చెత్త రహిత, ప్లాస్టిక్ వాడకం లేని భారతదేశం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసిఅధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజలు మురుగు కాలువలో, బహిరంగ ప్రదేశాలలో వేయడం ద్వారా అపరిశుభ్రత ఏర్పడుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్, కేడెట్లు పాల్గొన్నారు.

'బేడ బుడగ జంగం' హర్షం

కడప : బేడ బుడగ జంగం కులాన్ని ఎస్‌సి జాబితాలో తిరిగి చేరుస్తూ కేబినెట్ ఆమోదించి తీర్మానించడం హర్షనీయమని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైసిపి యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి అన్నారు. మంగళవారం వస్తాం అంజి ఆధ్వర్యంలో కడప నగరం పోస్ట్ ఆఫీస్ వద్దనున్న వైఎస్‌ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలా భిషేకం చేశారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు మాసిమ బాబు, కె. లక్షు మ్మయ్య, ఆంజనేయులు, డి. రాముడు, ఎం. జమ్మయ్య, సి. సయ్యన్న, డి. శంకర్, సి. పెదన్న, కె.అర్జునయ్య, సి. వెంకటయ్య, డి. సలప్ప, పి. ఆంజనేయులు, సి. సిగొటం, చిన్న వెంకటయ్య, ఎం. బాలస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇంటి స్థలం కేటాయించండి

కడప అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలం కేటాయించాలని విజయవాడలో ఉన్న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. యస్. జవహర్ రెడ్డికి ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె. వి. శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి. శ్రీ నివాసులు, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు యల్. కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్ కోరారు. మంగళవారం విజయవాడలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన సిఎస్ తప్ప కుండా కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, వివిధ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సిఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చలో కలెక్టరేట్‌ను అడ్డుకున్న పోలీసులు

- ఎస్‌ఎఫ్ఐ నాయకులు అరెస్టు.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలింపు

- ఉద్యమాలను అణచివేయాలని చూస్తే సహించం

కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కరించాలని మంగళవారం ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తంగా మారింది. విద్యార్థులు కోటిరెడ్డి సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి బైఠాయించారు. అనంతరం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసేందుకు కలెక్టరేట్‌లోనికి వెళుతున్న విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులతో కలిసి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం పోలీసులతో ఉద్యమాలను అణచాలని చూస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పూటకొక జీవో తీసుకొచ్చి విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారని విమర్శించారు. సంక్షేమ హాస్టల్ లలో చదువుకుంటున్న విద్యార్థులకు 5,6 నెలలుగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడు తుందన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విలీనంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులను విద్యకు దూరం చేస్తుం దన్నారని తెలిపారు. జీఓ నంబర్ 77 తీసుకువచ్చి పీజీ చదివే విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా ఉన్నత విద్యకు విద్యార్థులను దూరం చేస్తుందన్నారని పేర్కొన్నారు. జీఓ నంబర్ 107, 108 తీసుకువచ్చి ప్రభుత్వ మెడికల్ కళా శాలల్లో 50 శాతం సీట్లు అమ్మకానికి పెట్టిన దుర్మార్గుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో పాఠ్య పుస్తకాలు ఇవ్వకుండా, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆపేసి రాష్ట్ర ప్రభు త్వం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. విద్యార్థులకు మేనమామగా అండగా ఉంటానని చెప్పిన సిఎం విద్యార్థుల పక్షాన నిలబడకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, మెస్, కాస్మొటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రాహుల్, వీరపోగు రవి, జిల్లా కమిటీ సభ్యులు సురేష్ నాయక్, మనోజ్, అజయ్, రాజశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాయకులను విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు రాజేంద్రప్రసాద్, సునీల్, సురేష్, వీర పోగు రవి, అజయ్, రాహుల్ రాజశేఖర్ ను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని, వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ అయిన నాయకులను డివైఎఫ్ఐ నాయకుడు ఉదయ్‌తో కలిసి పరామర్శించారు.

రూ.1.12 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

కడప సిటీ : మృత్యుంజయకుంట రాజులవీధిలో వినాయక చవితి 23వ వార్షికోత్సవ సందర్భంగా స్వామివారి 30 కిలోల లడ్డును మంగళవారం వేలం వేశారు. స్టోర్ డీలర్ బాలరాజు సాయిరాజు వేలం పాడి లడ్డును దక్కించుకున్నారు. కవ్వా లడ్డును రూ. 61 వేలకు చిరంజీవి అనే వ్యక్తి పాడి దక్కించుకున్నారు. రాజుల వీధిలో వారం రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. స్థానికులు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

లోతట్టు ప్రాంతాలను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి - కడప

నగరంలోని 48వ డివిజన్ రామరాజుపల్లి సచివాలయం పరిధిలో ఉన్న కృపా, ఎస్‌బిఐ కాలనీల్లోని లోతట్టు ప్రాం తాలను మంగళవారం నగర కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ సందర్శించారు. వర్షపు, మురుగు నీటిలోనే నడుస్తూ కాలనీలను పరిశీలించారు. ఆయనకు పాస్టర్ పి.మహేష్, ఎస్. ఖాజా హుసేన్, ప్రదీప్ స్థానిక సమస్యలను వివరించారు. చిన్నపాటి వర్షం వస్తే కాలనీలను నీరు చుట్టు ముట్టి దోమలు అధికమై వ్యాధు లొస్తున్నాయని వాపోయారు. స్పందించిన కమిషనర్ డ్రైయినేజీ, వరద నీరు వెళ్లేందుకు త్వరలో నిధులు మంజూరుచేసి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానికులు సిస్టర్ శాంతమ్మ పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప

మహిళలు దిశ చట్టం గురించి అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్ అన్నారు. మంగళవారం జిల్లా యు వజన సర్వీసుల శాఖ(స్టెప్) ఆధ్వర్యంలో కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో మహిళల అక్రమ రవాణా-దిశా యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశ చట్టం ద్వారా మహిళలకు ఎంతో మేలు కలుగుతుందని తెలియజేశారు. వెట్టిచాకిరీ, లైంగిక అవసరాల కోసం పురుషులు, మహిళలు, చిన్నారులను అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారు అన్నారు కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మూర్తి, స్టెప్, మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, సిబ్బంది జి.వి. సుబ్బారావు, టి. నాగయ్య పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకం

కడప అర్బన్ : జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు డిఐఇపిసి సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరచాలన్నారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టని పేర్కొన్నారు. ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడడంతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రొత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారి శ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడిపి.) 2020-23 ప్రకారం వైఎస్‌ఆర్ జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 4 యూనిట్లకు, జెనరల్ కేటగిరీకి సంబంధించి మొత్తం 5 యూనిట్లకు గాను రూ.33.72 లక్షల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జెసి గణేష్ కుమార్ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలి

పోరుమామిళ్ల టౌన్ : గర్భిణుల్లో రక్తహీనత లేకుండా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మేరీ ఎలిసా అన్నారు. టేకూరుపేట సెక్టార్ అంగన్వాడీ-1 సెంటర్ లో మంగళవారం పోషకాహార మహోత్సవాన్ని సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరీ ఎలీషా పోషకాహార విలువలను, బాల్య వివాహాల వల్ల తలెత్తే సమస్యలను, బాల్య వివాహాల నిషేధ చట్టం - 2000 గురించి వివరించారు. తల్లులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలతో ఆహార పదార్థాలను తీసుకోవాలని అన్నారు. అనంతరం10 రకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో టేకూరుపేట సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది, ఆయాలు, తల్లులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

ఎంపిడిఒను సన్మానించిన ప్రజాప్రతినిధులు

చెన్నూరు : ఎంపిడిఒగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సుబ్రమణ్యం శర్మను మంగళవారం మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా పార్టీల నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. సర్పంచులు, వివిధ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు, నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, వైస్ ఎంపిపి ఆర్ఎస్(చిన్న), సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, తుంగభద్రయాదవ్, భాస్కర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

జనసేన బలోపేతానికి కృషి

పోరుమామిళ్ల టౌన్ : జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు శీలం శెట్టి లక్ష్మయ్య అన్నారు. మంగళవారం పోరుమామిళ్ల మూల వీధిలో జనసేన క్రియాశీలక సభ్యత్వం కిట్లను, బీమా పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శీలశెట్టి లక్ష్మయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దూర దృష్టితో పార్టీ సభ్యత్వం తీసుకున్న సభ్యులకు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందించి భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి క్రియాశీలక సభ్యులు చేస్తున్న కృషిని పార్టీ గుర్తించి గౌరవిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళ శీలంశెట్టి విజయలక్ష్మి, వీర మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ఎపిటిఎఫ్ ధర్నా

కడప అర్బన్ : టీచర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారానికై ఈనెల 30న కలెక్టర్ ఎదుట ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎపిటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తాను ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2023, జులై నుంచి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్, పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డిఎలను ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకాయిలను వాయిదాల పద్ధతిలో కాకుండా ఏకమొత్తంగా చెల్లించాలని కోరారు. సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, నాగరాజు, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుబ్బయ్య, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పట్టణ శివారులోని ప్రొద్దుటూరు రోడ్ హైవే బ్రిడ్జి వద్ద గత శనివారం వినాయక నిమజ్జనం సందర్భంగా టపాసులు కాల్చుతూ ప్రమాదవశాత్తూ గాయపడిన యువకుడికి మంగళవారం ఆర్థిక సాయం చేశారు. బాణసంచా నిప్పురవ్వలు ట్రాక్టర్‌లో ఉన్న సామగ్రిపై పడి పది మంది గాయాలైన విషయం తెలిసిందే. మైదుకూరు మండలం భూమాయపల్లెకు చెందిన ఎ.హరీష్ అనే యువకుడికి తీవ్ర గాయాలవడంతో మెడలో రక్తం గడ్డకట్టడం, దవడ ఎముక విరగడంతో చికిత్స పొందుతున్నారు. మొదట ప్రొద్దుటూరు ఆసుపత్రికి, తర్వాత మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర యువ నాయకులు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి బాధిత యువకుడిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదు అందజేశారు. అంతేకాకుండా కిమ్స్ హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి బాధిత యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

హరీష్‌కు నగదు అందజేస్తున్న రవిశంకర్‌రెడ్డి

ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వండి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెదురూరు గ్రామానికి చెందిన కొనిరెడ్డి సుధీర్‌కుమార్‌రెడ్డి ఆచూకీ తెలిసిన వారు చాపాడు పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. సుధీర్‌కుమార్‌రెడ్డి మూడేళ్లుగా కనపడుటలేదని వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2020లో ఇంటి నుంచి వెళ్లగా తిరిగి వస్తాడని పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితంలేదు. స్వయంగా ఇంటికి తిరిగి రాకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సుధీర్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించని జగన్

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టకుండా అధోగతి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని బిటెక్ రవి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసనగా మంగళవారం టిడిపి నాయకులు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నల్ల కండువాలు ధరించి రిలే దీక్షల్లో కూర్చున్నారు. వీరికి మద్దతుగా బిటెక్ రవి మద్దతుస్తూ, వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరకొచ్చాయన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, ఓబుల్‌రెడ్డి యాదవ్, రామమునిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిటెక్ రవి నాయకత్వంపై సొంత పార్టీలోనే నమ్మకం లేదు

పులివెందుల టౌన్ : పులివెందులలో బిటెక్ రవి నాయకత్వంపై సొంత పార్టీలోనే నమ్మకం లేక చాలా మంది పార్టీ కార్యకర్తలు దూరంగా అంటీఅంటనట్లు వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ పార్లపల్లె కిషోర్ పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు రోజులకొకరు దీక్షకు కూర్చుంటున్నారన్నారు. ఇటీవల జరిగిన పరిస్థితులతో బిటెక్ రవి పరిస్థితి దయనీయంగా తయారైంది నిరాహార దీక్షలో కూర్చునే క్యాడర్ కరువైందన్నారు. ఎవరైనా కూర్చుంటే రెండు వేలు, పచ్చ కండువా కప్పుకొని ఫొటో తీసుకుంటే ఐదు వేల రూపాయలు ఇస్తున్నా బిటెక్ రవి ఫొటోల ఫోజులతో కల్పిత ప్రచారం చేసుకొని పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు.

ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రయివేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘ రాష్ట్ర కన్వీనర్, వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షులు గడ్డంరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మందికిపైగా ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నారన్నారు. వారి సమస్యలపైన శాసనమండలిలో ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ ప్రభుత్వాన్ని ఈ విషయమై నిలదీశారన్నారు. అధికారపక్షం తమ మేనిఫెస్టోలో పెట్టి నాలుగున్నర సంవత్సరాలవుతున్నా వారి స్థితిగతుల్లో ఎలాంటి మార్పులేదన్నారు. వేతనాలు, సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి అంశాలను ఎమ్మెల్సీ ప్రశ్నించారన్నారు. మాటిచ్చిన ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో దొంగలు అరెస్టు

ట్రాక్టర్, ట్రాలీ స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ట్రాక్టర్, ట్రాలీ చోరీ కేసులో దొంగలను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సిఐ సదాశివయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మైలవరం మండలం వేపరాల గ్రామవాసి మంచాల మోషే అనే వ్యక్తి గనిపని చేసుకుంటూ జీవనం చేసుకుంటున్నట్లు తెలిపారు. మంచాల మోషే కు చెందిన ట్రాక్టర్, ట్రాలీ ప్రతి రోజూ గని పనికి వెళ్లి తిరిగి రాత్రి వాటిని శ్రీనివాస పెట్రోల్ బంక్‌లో ఉంచి ఇంటికెళ్లేవారు. మళ్లీ ఉదయం తీసుకొని వెళ్లేవారన్నారు. ఈ క్రమంలో ఈనెల 8న రోజూలాగే పెట్రోల్ బంక్ ఆవణలో పెట్టి ఇంటికెళ్లారు. ఉదయం 4 గంటలకు వచ్చి చూసుకొనగా ట్రాక్టర్, ట్రాలీ కనిపించలేదు. దీనిపై బాధితుడు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం 6గంటలకు రాబడిన సమాచారం మేరకు ఎస్ఆర్‌పెట్రోల్ బంక్ వద్ద ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా తాడిపత్రి వైపు నుండి ఇద్దరు వ్యక్తులు షేక్ హాజివలి, చాంద్‌బాషాను అరెస్టు చేవామన్నారు. వీరు ట్రాక్టర్, ట్రాలీతో ప్రొద్దుటూరు వైపునకు వస్తుండగా అరెస్టు చేసి, ట్రాక్టర్, ట్రాలీని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.5లక్షలని తెలిపారు. సమావేశంలో జమ్మలమడుగు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుళ్లు రియాజ్ అహ్మద్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అరెస్టయినవారితో జమ్మలమడుగు అర్బన్ పోలీసులు

12 ఎర్రచందనం దుంగలు పట్టివేత

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ అటవీశాఖ పరిధిలోని లంకమల్ల అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు కూంబింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న అయిదుమంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, 12 ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నామని స్పెషల్ ఫారెస్ట్ ఆఫీసర్ శుభం తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బి మఠం మండల పరిధిలోని లోతువంక బీట్ సమీపంలో కొత్తపేట గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని విచారించగా అదే గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి ద్వారా ఈ పనిని ఒప్పుకున్నామని తెలిపారని పేర్కొన్నారు. ఇదంతా వింజమూరుకు చెందిన రామనాథ్‌రెడ్డి అనే వ్యక్తి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిసిందన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ వెంకట శేషయ్య, బీట్ ఆఫీసర్ సుదర్శనం, శ్యామ్ సుందర్, సువర్ణ కుమార్, రాజేష్‌రెడ్డి, లోతువంక బీట్ ఆఫీసర్ సుంకరయ్య పాల్గొన్నారు.


ఎర్రచందన దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

ఆర్‌బికెలో కనిపించని బ్యాంకింగ్ సేవలు

రైతులకు తప్పని తిప్పలు - రుణాల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజాప్రతినిధులు చెప్పినట్లు రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బికె) బ్యాంకు సేవలు కనిపించడంలేదు. రెండేళ్ల కిందట ఆర్‌బికెల్లో బ్యాంకు కరస్పాండెంట్ల(బిసి)ను నియమించి సేవలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు తమ కష్టాలు తీరుతాయని ఆశపడ్డారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రైతులు సాగు పెట్టుబడులతోపాటు, ఇతర సేవల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 55 ఆర్‌బికెలున్నాయి.

ప్రకటనలకే పరిమితం..

రైతులు బ్యాంకులకు వెళ్లనవసరం లేకుండా బ్యాంకు ప్రతినిధుల(బిసి)ను నియమించి రైతు భరోసా కేంద్రాలకు మ్యాపింగ్ చేశారు. ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు. వీరికి బ్యాంకులే అవసరమైన సామగ్రిని సమకూర్చి రోజుకు రెండు గంటల పాటు రైతు భరోసా కేంద్రాల్లో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. వీరి ద్వారా రూ.10 వేల వరకు నగదు జమ, బదిలీ చేయవచ్చు. రూ.20 వేలు తీసుకొనేలా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా సేవలు అమలు కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో..

ప్రొద్దుటూరు మండల పరిధిలోని కల్లూరు, ఉప్పరపల్లి, తాళ్లమాపురం, కాకిరేణిపల్లి, చౌడూరు రైతులు కూడా 12 నుండి 20 కిలో మీటర్ల దూరం పైబడి ఉన్న ప్రొద్దటూరు వచ్చి బ్యాంకు సేవలను వినియోగించుకోవాల్సి వస్తోంది. రైతులకు కూడా బ్యాంకులు 12 నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. బ్యాంకు సేవలకు ఇబ్బందులు పడుతున్నారు.

రైతు భరోసా కేంద్రం

ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తేవాలి

రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చి రైతులను ఆదుకుంటే ప్రయోజనం ఉంటుంది. లేకుంటే రైతు భరోసా కేంద్రాలున్నా నిరుపయోగమే. గతంలోలా ప్రతి చిన్న పనికి బ్యాంకుకు వెళ్లాల్సిందే. అందుకోసం ఒకరోజంతా కేటాయించాల్సి వస్తోంది. రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెస్తే రైతులకు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

- ఆకుమల్ల దావీదు, రైతు

త్వరలో బ్యాంకు సేవలు అందేలా చర్యలు

రైతు భరోసా కేంద్రాల్లో బ్యాంకింగ్ సేవలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహించడం లేదు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలోనే బ్యాంకు సేవలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- సురేష్‌రెడ్డి, ఎడిఎ, ప్రొద్దుటూరు డివిజన్

అంగన్వాడీలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

వేంపల్లె : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - వేంపల్లె

అంగన్వాడీలపై అక్రమంగా పోలీసులు పెట్టిన కేసులను ప్రభుత్వం ఎత్తి వేయాలని అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించుకొనేందుకు తలపెట్టిన చలో విజయవాడను అడ్డుకోవడం శోచనీయమన్నారు. శాంతియుతంగా జరిగే ఉద్యమాలపై కూడా నిర్బంధాలు పెట్టి అంగన్వాడీలపై కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదన్నారు. మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా గుర్తించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు శైలజ, ధనలక్ష్మి, హసీనా, నాగేశ్వరి పాల్గొన్నారు.

కమలాపురం : న్యాయమైన సమస్యలపై అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు రాష్ట్రంలో లక్ష మందికి పైగా జరుపుతున్న పోరాటంపై పోలీసు జులుం ప్రదర్శించడాన్ని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా ఖండిస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. అంగన్వాడీ వర్కర్స్‌పై పోలీసులను ఉపయోగించి జరిపిన నిర్బంధానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఊరేగింపులు, ర్యాలీలు, ధర్నాలు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు పిలుపునిచ్చాయన్నారు. నిర్బంధానికి నిరసనగా రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపులో భాగంగా మంగళవారం కమలాపురంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు రాణి, జ్యోతి, యశోద, భవాని, కుష్మావతి, భారతి, ఉషారాణి, ఉమాకాంతమ్మ, రామప్రభ, మయూరి, ప్రభావతి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సి.సుబ్బారాయుడు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : రాష్ట్రవ్యాప్తంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ వెళ్లిన అంగన్వాడీలను నిర్బంధించడం, అరెస్టు చేయడం అన్యాయమని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఏసుదాసు, దాసరి విజయ్ ఖండించారు. స్థానిక ఎన్‌జిఒ హోం కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పోలీసుల ద్వారా అంగన్వాడీ వర్కర్లకు నోటీసులు ఇచ్చి, బెదిరించి, అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు ఆటో స్టాండ్ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

కమలాపురం ధర్నాలో మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులురెడ్డి

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా ఉంచాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ సభా భవనంలో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎన్ని సమస్యాత్మక కేంద్రాలున్నాయో గుర్తించాలన్నారు. ఓటు వేయనీయకుండా ఓటర్లను అడ్డుకునే కేంద్రాలను ముందుగానే తెలుసుకుంటే, అక్కడ పోలీస్ బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. స్వేచ్ఛాయుత, శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆయా ఏరియా పోలీస్ ఇన్‌స్పెక్టర్ వీటిపై శ్రద్ధ పెట్టాలన్నారు. బిఎల్‌ఒలు కూడా ఆ గ్రామ లేదా పోలింగ్ కేంద్రాల పరిస్థితిని అంచనా వేయాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎక్కడేగాని అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడకూడదని తెలిపారు. పోలీసులు ముందుగానే ఆయా పార్టీల నాయకులకు శాంతియుత ఎన్నికలపై అవగాహన కల్పించాలన్నారు. డిఎస్‌పి నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని మొత్తం పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించి మంచి వాతావరణంలో ఎన్నికలు జరిపేలా చేస్తామన్నారు. అందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, సిఐలు, ఎస్ఐలు, తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాల్గొన్న పోలీసు, రెవెన్యూ అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

సాంకేతిక విద్య ఉపాధికి దోహదపడుతుంది

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ విఎస్ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - వేంపల్లె

సాంకేతిక విద్య ఉపాధి అవకాశాలకు దోహద పడుతుందని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ శ్రీనివాసమూర్తి అన్నారు. స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి చారిటిస్ ఐటిఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో పరిజ్ఞానం పెంచుకుంటే ఏ రంగంలోనైనా రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఐటిఐ చదువుతున్న విద్యార్థులు మంచి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఐటిఐలో చదివిన ప్రతి విద్యార్థి ఆయా రంగాల్లో ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే భావనతో 1979లో మాజీ ఎంపీ కందుల ఓబుల్‌రెడ్డి జిల్లాలోనే మొదటి సారిగా వేంపల్లెలో ఐటిఐని స్థాపించారని చెప్పారు. అలాగే రాయలసీమ వాసుల కోసం 1980లోనే కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలను కడపలో మొదటిసారి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విషయ పరిజ్ఞానంలో విద్యార్థులు రాణించినప్పుడే ఉన్నత స్థాయి చేరుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్ రావు మాట్లాడుతూ ఐటిఐ విద్యార్థులకు చాలా డిమాండ్ ఉందన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డాక్టర్ విస్ శ్రీనివాసమూర్తి, పంచాయతీ కార్యదర్శి నాగ భూషణంరెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఐటిఐ అధ్యాపకులు చంద్రశేఖర్, అమర్నాథ్‌రెడ్డి ప్రభాకర్ నాయుడు, ఉత్తమారెడ్డి, విజయ్‌భాస్కర్, వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరు పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్‌కౌశల్

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి : ఎస్‌పి

చాపాడు : నేరాల అదుపులో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. మైదుకూరు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు తగిన సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్, చైల్డ్ మ్యారేజెస్, దిశ యాప్, మహిళలపై జరిగే నేరాలు, ఆన్‌లైన్, సైబర్ మోసాలు తదితర విషయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, అర్బన్ సిఐ చలపతి, రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **ఖాజీపేట :** స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలుకేసులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, గ్రామీణ సిఐ శ్రీనాద్ రెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. **చెన్నూరు :** ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ మంగళశారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, స్టేషన్ పరిసరాలను కలయతిరాగారు. సిబ్బంది పనితీరును ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. బహిరంగ ప్రదేశాలు, పాఠశాలల్లో గస్తీ నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడూ చర్యలు చేపట్టాలని ఎస్‌పి సిబ్బందికి ఆదేశించారు. **అట్లూరు :** స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మికంగా సందర్శించారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో బాల్య వివాహాలు, దిశ యాప్, ఆన్‌లైన్ మోసాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మైదుకూరు డిఎస్‌పి ఎఆర్ వంశీధర్‌గౌడ్, బద్వేలు రూరల్ సిఐ సుదర్శన్ ప్రసాద్, అట్లూరు ఎస్ఐ కెసి రాజు ఉన్నారు. **బద్వేలు :** పట్టణ అర్బన్ అప్ గ్రేడ్ పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, మొక్కలతో పచ్చదనంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట బద్వేలు అర్బన్ సిఐ యుగంధర్, రూరల్ సిఐ సుదర్శన్ ప్రసాద్ ఉన్నారు.

క్రీడా పోటీలకు స్వామి వివేకానంద విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడంతో ఆయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. అండర్-17 విభాగంలో బాలుర విభాగం నుండి విష్ణువర్ధన్‌రెడ్డి, బాలికల విభాగంలో మహిత, లలిత.. అండర్-14 విభాగంలో బాలుర విభాగం నుంచి జగదీశ్వర్‌రెడ్డి, బాలికల విభాగంలో సాహిత్య ఎంపికయ్యారని తెలిపారు. అండర్-17 విభాగంలో ప్రతిభ చూపిన విద్యార్థులు 30న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కరస్పాండెంట్ తెలిపారు. విద్యార్థులు ప్రతిభ చూపేందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ పద్మజను కరస్పాండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల విశ్వనాథపురం గ్రామంలో మంగళవారం ఐసిడిఎస్ సిడిపిఒ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి కలెక్టర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆ మేరకు గ్రామాల్లో కూడా సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **ముద్దనూరు :** బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ధనుంజయుడు, ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం అన్నారు. స్థానిక మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న పిల్లలకు పెళ్లి చేస్తే అనారోగ్యం బారిన పడతారన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి, రూ.50వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. గ్రామాల్లో, పాఠశాలల వద్ద ఆకతాయిలు ఆడ పిల్లలను అల్లరి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిఎం ఇబ్రహీం, సిసిలు, జేఆర్పీ వెంకట సుబ్బమ్మ, వివోఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నాయకుల చిత్రపటాలతో విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక పట్టణ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్)లో మంగళవారం మేరా మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. విద్యార్థులు జాతీయ నాయకుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ, జాతీయ జెండాలు పట్టుకొని స్వతంత్ర సమరయోధుల పేర్లను స్మరిస్తూ పాఠశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు మట్టిని సేకరించి కలశంలో నింపారు. ఆ మట్టి కలశాన్ని విద్యార్థులు ఎంఇఒకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సర్వేశ్వరి, లీలావతమ్మ, సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన వికాసానికి మానవ పరివర్తన ముఖ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

మారుతున్న జీవన విధానాలకు మానవుని అంతరంగిక పరివర్తన చాలా ముఖ్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాయి సేవా సమితి ఆధ్వర్యంలో 'మానవత్వం-పెంపొందించు విద్య యొక్క ఆవశ్యకత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో విద్యార్థులు ప్రతిభను రాణించాలని కోరారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇలాంటి పోటీలు అవసరం అవుతాయాని చెప్పారు. విలువలు ఉంటేనే సమాజంలో ముందుకు సాగేందుకు వీలుంటుందని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ, సాయి సేవా సమితి సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన లేక.. రాకపోకలు సాగక..

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని సింహాద్రిపురం-వెలిదండ్ల రహదారిలోని గురిజాల వంతెన వద్ద స్వల్ప వర్షం వచ్చినా రాకపోకలు నిలిచి పోతున్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ప్రస్తుతం ఉన్న వంతెన వద్ద నీటి ప్రవాహంతో నీరు రోడ్డుపై ప్రవహించింది. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. గతేడాది ఏడాది నీరు రోడ్డుపైకి రావడంతో కారు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నీటి ప్రవాహం పోయేలా పెద్ద వంతెన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వర్షానికి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

పౌష్టికాహారంపై అవగాహన

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : ఈనెల 1 నుండి 30 వరకు జరిగే పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక అర్బన్ పరిధిలోని స్వరాజ్ నగర్ సెక్టర్‌లో సూపర్వైజర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు, రమ్య, దేవి, తల్లులు పాల్గొన్నారు.

29న హుండీ కానుకల లెక్కింపు

చాపాడు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో శాశ్వత హుండీ కానుకల లెక్కింపు కార్య క్రమాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ శ్రీనివాసులు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవ దాయ శాఖ సిబ్బంది, కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. లెక్కింపు అనంతరం నగదును స్వామివారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ఇఒ తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE 4th ADDITIONAL DISTRICT JUDGE: KADAPA
I.A.No. 509 of 2021 in O.S. No. 9 of 2009

Between
Smt. Mohammed Ghousinnisa Begum, W/o late Mohammed Ajim @ Ameer, aged about 56 years, Muslim, House-wife, resident of D.NO. 16/121, Masapet, Kadapa district and two others.
...Petitioners/Plaintiffs
Vs
And
64. Smt. Sure Adilakshumma, daughter of late Kottluri Venkata Subbamma, aged about 44 years, Hindu, House hold, residing at Mitta Street, Badvel town and Mandal Kadapa District.
...Respondents/Proposed Party No. 64

NOTICE TO RESPONDENTS/PROPOSED PARTIES No.64.

Please take notice that the petitioners/plaintiffs has filed the above I.A. against you to add you as the legal heirs of deceased 4th Defendant as Defendant No. 64 in the above suit as well as petitions pending there on, and the above I.A. stands posted for your appearance either personally or through advocate, at 10.30 A.M. on 30.10.2023 before the said court and if you fail to appear, matter will be decided ex-parte.

//By order Of the Court//
M.SURESH KUMAR, M.A.,B.L.,
Advocate for the Petitioners-Plaintiffs, Kadapa City, A.P.